# 6

# ఏలా
# వారసత్వమునకు అనర్హుడు

*మూల వాక్యము: 1 రాజులు 16:6, 8-10*

1977లో కొందరు స్నేహితులు నేను నూతన సంవత్సరపు రాత్రియందు దేశవ్యాప్తంగా ప్రచురించబడిన కాలిబంతి ఆటను చూడడానికి కూర్చున్నాము. ఒక జట్టు ఓడిపోవునట్టు తీర్మానించబడి మరియొక జట్టుచే లోబరచబడుతున్నదని ఎదురుచూడబడింది. తేలికైన విజయమని దేన్ని తలంచమో దాన్ని చూడడానికి మేము తిష్టవేసాము. మాకు ఆశ్చర్యము కలిగించేలా, బంతిని తన్నిన మొదటినుండి ఆట చివరి ఘడియవరకు ఓడిపోవనున్న జట్టు ఆటను వశపరచుకొని పెద్ద తేడాతో ఆటను గెలుచుకొంది. మేము ఏమి చూస్తున్నామో దాన్ని నమ్మలేకపోయాము. అంత ఎక్కువైన నైపుణ్యములేని జట్టు ఎక్కువ శ్రేష్ఠమైన జట్టుపై తేలికగా విజయం సాధించింది! ఇది ఎలా సంభవింపగలిగింది? తరువాత దీనికి కారణము ఒకే మాటలో సంక్షిప్తం చేయబడినట్టు మేము కనుగొన్నాము. అది: “సిద్ధపాటు.” ఎక్కువగా అభిమానింపబడిన జట్టు మితిమీరిన నమ్మకంతో ఆలోచింపసాగింది. “మేము చేయవలసినదంతా వచ్చి కనబడటమే, ప్రయాసపడనక్కర లేదు, మేము గెలుస్తాం” అని భావించింది. జట్టుకు తర్ఫీదు యిచ్చేవారు వాతావరణాన్ని కూడ లక్ష్యపెట్టలేదు; విస్తరించి కురిసిన వర్షం ఆ రంగ స్థలాన్ని బురద నేలగా మార్చేసింది, నీళ్లతో తడిచిన రంగస్థలం మీద ఆడడానికి అవసరమైన బూట్సు తెచ్చుకోలేదు. తత్ఫలితంగా, గెలుస్తుందని ఎదురు చూడబడిన జట్టు రంగస్థలమంతటిలో జర్రు బుర్రున జారుకుంటూ పడుతూ లేస్తుండగా ఓడిపోవనున్న జట్టు వారిగుండా సరిగా పోయి జయించిన రికార్డు పుస్తకాల్లోనికి ఎక్కింది. ఇక్కడ కీలకమైన పదం *“సిద్ధపాటు.”*

ప్రబలమైన బైబిలు చర్చనీయాంశాలలో సిద్ధపాటు అనేది ఒకటైయున్నదంటే ఆశ్చర్యపడనక్కరలేదు. క్రీడారంగంలో మాత్రమే గాకుండ జీవితంలోని ప్రతి భాగంలోను సిద్ధపాటు అవసరమైయుంది. అది అవసరం లేనివారు ఎవరు ఉండరు. దేవుడు సహితము దానినుండి తనను మినహాయించుకోబోలేదు.

ఉదాహరణకు, దేవుడు అబ్రాహామునకు భూవాగ్దానం చేసాడు (ఆదికాండము 12:7), కాని అబ్రాహాము సంతతియైన ఇశ్రాయేలీయులను వాగ్దాన భూమికి తోడుకొని రాకముందు ఆయన 430 సంవత్సరాలు వేచియున్నాడు. సిద్ధపాటు చేయవలసియుంది, ఆ సిద్ధపాటుకు దీర్ఘకాలం పట్టింది. ఇశ్రాయేలీయులను కనానుకు తెచ్చుటకు తన నాయకుడుగా మోషేను కోరుకున్నాడు, అయితే ఇశ్రాయేలీయులకు అవసరమైన

నాయకుడుగా ఉండునట్లు దేవుడు మోషేకు ఎనుబది సంవత్సరాల సిద్ధపాటును యిచ్చాడు. దేవుడు ఎన్నడును తొందరపడడు, కాని ఆయన ఎప్పుడును ఆలస్యమైయుండడు. సమయం ఆసన్నమైనప్పుడు పరిస్థితులన్ని సక్రమంగా అమర్చబడినప్పుడు, తాను వాగ్దానం చేసినట్టు దేవుడు ఆ భూమిని ఇశ్రాయేలీయులకు యిచ్చాడు.

మెస్సీయా అనబడిన యేసును లోకంలోనికి తెచ్చుటలో కూడ అదే జరిగింది. ఆయన రాకకు లోకాన్ని సిద్ధపరచుటకు గాను పితరుల యుగము, మోషే యుగము అనే రెండు మానవ చరిత్ర యుగాలను దేవుడు ఉపయోగించుకున్నాడు. మెస్సీయా అవతరించినప్పుడు ఆయన వచ్చిన ఆ ఘడియను సూచించడానికి, "కాలము సంపూర్ణమైనప్పుడు" అని పరిశుద్ధాత్మ సూచించాడు (గలతీయులకు 4:4).

క్రీస్తు రాకకు మార్గాన్ని సిద్ధపరచే వర్తమానికుడుగా రమారమి ఒక సంవత్సరం పాటు సేవ చేయడానికి దేవుని యొక్క "సువార్త తర్ఫీదు స్కూలులో" బాప్తిస్మమిచ్చు యోహాను ముప్పై సంవత్సరాలకు పట్టభద్రుడయ్యాడు (మత్తయి 3:1). క్రీస్తు కూడ తన భూ నివాస కాలపు పరిచర్యను తగిన కాలంలో ఆరంభించడానికి ముప్పై సంవత్సరాలు సిద్ధపడి వేసియున్నాడు (లూకా 3:23).

సిద్ధపాటు విషయంలో దేవుడు తన్నుతానే మినహాయించుకోనప్పుడు సిద్ధపాటు లేని మనలను ఆయన క్షమించడని మనము నిశ్చయముగా ఎరుగవచ్చును. ఆయన వాక్యము యొక్క హెచ్చరిక ఏమంటే – మనము సిద్ధపడాలి లేకుంటే పర్యవసానాన్ని అనుభవించాలి.

వారి అవకాశముల ఘడియలకు తమ సామర్థ్యం మేరకు ఆడుటకు సిద్ధపడని క్రీడాకారులు, ఒప్పించేలా ప్రసంగింపని సువార్తికులు, ఉన్నది ఉన్నట్టు ఉపదేశించలేని ఉపదేశకులు, సార్థకమైనట్టు నడిపించలేని నాయకులను గూర్చి ఆలోచించుము. బహుశా, లోకంలో తరచుగా జరిగే దోషం, సిద్ధపడుటలో తప్పిపోవుటయై ఉంటాది. మనము జీవితాన్ని సునాయాసంగా తీసికొంటాం, దృశ్యాలను అనుభవిస్తాం, తదుపరి – ఒక పెద్ద అవకాశం వస్తుంది – సిద్ధపాటు లేకుండానే మనం దాన్ని ఎదురుకొంటాం. ఆ మీదట మిగిలిన మన జీవితాలను "నేను సిద్ధపడే ఉన్నట్టయితే" అనే కొరడా తీసుకొని మన మనస్సాక్షి వెనుక భాగాన్ని కొట్టుతునే ఉంటాం.

బహు సాధారణంగా, ఇశ్రాయేలీయుల నాలుగవ రాజైన ఏలా యొక్క పతనం సిద్ధపాటు లేనందువలన కలిగినదైయుంటుంది. పేరుగాంచిన బైబిలు సంబంధితయైన రచయిత W. Graham Scroggie అతనిని "befuddled fool" అని పిలిచాడు.[1] అతని ఏలుబడి విపత్కరమైనది ఎందుకంటె అతడు దేశాన్ని నడిపించడంలో సిద్ధపాటు లేనివాడు. ఇశ్రాయేలు యొక్క మూడవ రాజైన బయెషా కుమారుడుగా "అతడు ఐశ్వర్యవంతుడై జన్మించినది వాస్తవమే." తన రాజ కుటుంబానికి దేశము యివ్వగల శ్రేష్ఠమైనవాటిని పొందె ఆధిక్యతలో అతడు ఉన్నాడు. తన తండ్రి మరణానంతరము అతని స్థానంలో తానే రాజై ఉంటాడని ఆరంభంనుండి అతనికి తెలిసేయుండవచ్చు. ఒక రోజున అతనికి సింహాసనం దక్కుతుంది ఆ దేశము అతని నాయకత్వానికి కనిపెట్టుతుంది గనుక అతడు సిద్ధపడవలసినవాడై ఉంటాడు. దేవుడు కోరిన నాయకుడు అతడు కాగోరినట్టయితే తన తొలి సంవత్సరాలు సిద్ధపాటుతో గడిపేవైయుండేవి. కావలసిన సిద్ధపాటుకు ప్రయాస,

సమయం, ఆలోచన, ప్రార్థన, శ్రద్ధ, క్రమశిక్షణ అవసరమై ఉంటాయి. "అతడు చేయగలడా?" అనేది ప్రశ్న కాదు. ఇంతకు ప్రశ్న ఏమంటే "అతడు చేస్తాడా?" ఏదో ఒక హేతువునుబట్టి, దీనికి అతడు యిచ్చిన జవాబు ఏమంటే "లేదు." సిద్ధపడకుండుటకు అతడు ఎందుకు కోరుకున్నాడో తెలియదు. మనకు తెలిసినదంతా ఏమంటే సిద్ధపాటు లేకుండానే అతడు సింహాసనానికి వచ్చాడు. తత్ఫలితంగా అతని పరిపాలన కొద్దిదిగాను, విచారకరమైనదిగాను, దుఃఖసహితమైనది గాను ఉంది. జ్ఞాపకార్థ చిహ్నంగా మిగిలిపోయే దానికి బదులు, దోష భరితమైనదైయుంది; విజయోత్సవంతో కూడినదై ఉండడానికి బదులు, విపత్కరమైనదైయుంది.

ఏలా రాజుగా లేఖనాలు ఎక్కువగా మనకు తెలుపవు. దైవికమైన అతని జీవిత గాధ కేవలము ఆరు వచనాలలోనే కుదించబడింది:

> యూదారాజైన ఆసా యేలుబడిలో ఇరువదియారవ సంవత్సరమున బయెషా కుమారుడైన ఏలా తిర్సాయందు ఇశ్రాయేలువారినందరిని ఏలనారంభించి రెండు సంవత్సరములు ఏలెను. తిర్సాలో తనకు గృహనిర్వాహకుడగు అర్సాయింట అతడు త్రాగి మత్తుడై యుండగా, యుద్ధ రథముల అర్ధభాగముమీద అధికారియైన జిమ్రీ అతని మీద కుట్రచేసి లోపలికి చొచ్చి అతని కొట్టి చంపి అతనికి మారుగా రాజాయెను. ఇది యూదారాజైన ఆసా యేలుబడిలో ఇరువది యేడవ సంవత్సరమున సంభవించెను. అతడు సింహాసనాసీనుడై యేలనారంభించిన తోడనే బయెషా సంతతివారందరిలో ఏ పురుషునే గాని అతని బంధువులలోను మిత్రులలోను ఎవరినే గాని మిగులనియ్యక అందరిని హతముచేసెను. బయెషాయును అతని కుమారుడగు ఏలాయును తామే పాపముచేసి, ఇశ్రాయేలువారు పాపము చేయుటకు కారకులై, తాము పెట్టుకొనిన దేవతలచేత ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు కోపము పుట్టించిరి గనుక వారు చేసిన పాపములను బట్టి ప్రవక్తయైన యెహూద్వారా బయెషానుగూర్చి యెహోవా సెలవిచ్చిన మాట నెరవేరుటకై జిమ్రీ బయెషా సంతతివారినందరిని నాశనముచేసెను. ఏలా చేసిన యితర కార్యములను గూర్చియు, అతడు చేసిన క్రియలన్నిటిని గూర్చియు ఇశ్రాయేలు రాజుల వృత్తాంతముల గ్రంథమందు వ్రాయబడియున్నది (16:8-14)?

ఏలా సింహాసనమునకు వచ్చి రెండు సంవత్సరాలలోని భాగాలను ఏలుబడి చేసాడు, అంటే క్రీ.పూ. 888నుండి క్రీ.పూ. 886వరకు. అది కథ; అతని గూర్చి చెప్పేది మరేమీ లేదు. తన పక్షంగా చెప్పుకోతగిన ఏ కార్యము లేకుండనే అతని ఏలుబడి యొక్క అల్ప కాలము గతించిపోయింది. తాను నడిపించిన ప్రజల మన్ననలనుగాని లేక తన సొంత సైన్యపు గౌరవాన్నిగాని అతడు పొందినవాడు కాడు.

ఒక రోజున ఏలా తాగి మత్తుడైన స్థితిలో "తిర్సాయందు తనకు గృహనిర్వాహకుడగు" అర్సాయింట పడియున్నాడు. ఈ అదను చూచుకొని రాజు యొక్క అర్ధ రథాధిపతియైన జిమ్రీ అతనిని హత్య చేసాడు. అర్సా కూడ ఏలా హత్య పన్నాగములో భాగస్వామియై ఉండవచ్చు. ఏలా యొక్క హత్యతో ఇశ్రాయేలు యొక్క రెండవ రాజ వంశము అంతరించింది. యెహూ ముందుగా సూచించినట్టు రాజుగా జిమ్రీ బయెషా బంధువు లందరిని హతము చేసాడు (16:4). బయెషా యింటిలో పురుషుల నెవరిని మిగల్చకుండ జిమ్రీ హతము చేసాడు (16:11).

ఏలా పరిపాలించడానికి సిద్ధపడియుండవల్సింది. అతడు సిద్ధపడియుంటే అతని ఏలుబడి ఎంత వ్యత్యాసంగా ఉండేదో! అతడు సిద్ధపడియుంటే దేవుడు అతని ద్వారా ఏమి జరిగించి యుండేవాడో మనకు తెలియదు. అయితే అతనితోను అతని ద్వారాను దేవుడు ఆశ్చర్యమైన కార్యములు జరిగించి యుండేవాడేనని మనము ఎరుగుదుము.

అతడు ఏలాగు సిద్ధపడియుండేవాడు? అతడు ఏమి జరిగించగలిగియుండేవాడు?

## దేవుని మాట వినుటవలన

మొదటిగా, దేవుని మాట వినుటవలన ఈ నాయకత్వపు స్థితికి ఏలా సిద్ధపడి ఉండేవాడే. దేవుని ప్రవక్తలు సమీపంగానే యున్నారు. వారు దేవుని చిత్తాన్ని బయలుపరుస్తున్నారు. యరోబాముకు అహీయా, పేరు చెప్పబడని ప్రవక్త ఉన్నారు (11:29; 13:1). బయెషాకు యెహూ (16:1) మరియు యింకా యితర ప్రవక్తలు ఉన్నారు. సింహాసనానికి రాక ముందు, ప్రవక్తల యొద్దనుండి దేవుని చిత్తము పొందే అవకాశాలు అనేకాలున్నాయి. తన జీవితం కొరకును, దేశం కొరకును దేవుని చిత్తం ఏమైయుందో వారి సందేశాలను విని గ్రహించి దానికి అతడు తన హృదయాన్ని తెరిచి ఉండాల్సిందే. యౌవనుడుగా దేవుని చిత్తాన్ని తన హృదయంలోనికి అతడు తీసికొని ఉండినట్లయితే రాజుగా దేవుని చిత్తాన్ని జరిగించడానికి అతడు సిద్ధపడి ఉండేవాడే.

మనం వినగలం తెలిసికొనలేం, ఆలకించగలం అర్థం చేసికోలేం. చెవులారా విని కన్నులారా చూచి హృదయంతో గ్రహించక యున్నవారిని గూర్చి యేసు పలికారు (మత్తయి 13:15). "యెల్లప్పుడును నేర్చుకొనుచున్నను, సత్యవిషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడును పొందలేని" కొందరిని పౌలు వర్ణించాడు (2 తిమోతి 3:7). ఇలాటి పద ప్రయోగాలు ఏలాను తగినట్లు వర్ణించియుండవచ్చు. నేర్చుకొనే అవకాశాలు తనకున్నాయి, తనకు కలిగిన అవకాశాలను అతడు అలక్ష్యం చేసాడు. ఏమి చేయాలని దేవుడు కోరాడో దానిని దేవుని ప్రవక్తలు ప్రసంగించుచుండగా అతడు హాజరయ్యాడు; అతడు ఆ సందేశాన్ని గూర్చి ఆలోచించినవాడు కాకపోవచ్చు లేదా దాని విలువను అతడు గ్రహించకపోయి ఉండొచ్చు. సింహాసనమునకు అతడు వారసత్వము పొందినప్పుడు – జాతికొరకు అతడు ఒక మనిషిగా నిలువాలని – సమయం ఆసన్నమైనప్పుడు నీతిగల రాజుగా ఉండాలనే భావన అతనికి కలుగలేదు.

అవకాశపు ఘడియలు దేవుడు మనకిచ్చాడు. ఈ రాజువలె మనము సిద్ధపాటు లేకయున్నామా? దేవుడు తన వాక్యం ద్వారా మనతో మాట్లాడాడు (హెబ్రీయులకు 1:1, 2), అయితే వాటిని మనము స్వీకరించామా? ఇశ్రాయేలీయులు మిగిలిన కనానును తీసికొనుటకు సిద్ధపడుచుండగా, రేపటికొరకు తమ్మును తాము పరిశుద్ధపరచుకొనుడని యెహోషువ ప్రజలతో చెప్పాడు (యెహోషువ 7:13). రేపటికొరకు వారు తమ్మును తాము ఎలా సిద్ధపరచుకొనగలరు? దేవుని చిత్తమునకు అనుకూలంగా తన హృదయాలను, సిద్ధపరచుకొనుట ద్వారా, పాపమును వారి జీవితములోనుండి తీసివేసికొంటు, దేవుని చిత్తమును జరిగించడానికి తమ్మును తాము సిద్ధపరచుకొనిరి. ఏలా దీనినే జరిగించుటలో విఫలుడయ్యాడు. అతని యౌవన కాలంలో దేవుని చిత్తాన్ని జరిగించడానికి దేశాన్ని

అందులో నడిపించడానికి అతడు సిద్ధపడవలసియుండెను. ఏదో ఒక కారణాన్నిబట్టి, సిద్ధపడే అతని సమయాన్ని అతడు వ్యర్థపరచాడు. ఈ హేతువుచేత అతడు వారసత్వము పొందినప్పుడు దానికి అతడు తగినవాడు కాకపోయాడు.

## దేవునితో నడచుటచేత

యౌవనుడుగా దేవునితో నడచుటయందు ఏలా తన్నుతాను సిద్ధపరచుకొనేవాడే. రాజ్యమునకు యువ రాజుగా సిద్ధపడియుండేవాడే. ప్రజల యెదుట రాజు దేవుని యొక్క ప్రతినిధిగా నిలిచియుండేవాడే. అతడు రాజకీయవేత్త కాడు, కాని అధిపతి – నీతి మార్గములలో ప్రజలను నడిపించవలసినవాడు. ఈ స్థానంకొరకు అతడు శ్రేష్ఠముగా సిద్ధపడినట్లయితే ఎంత బాగుండేదో – అనుదినము దేవునితో ప్రార్థనలు ధ్యానము ద్వారా నడచుటయు దేశంకొరకు, లోకముకొరకు దేవుని చిత్తాన్ని ఎరుగగోరటం ఎంత శ్రేష్ఠంగా ఉండేదో? తన బాల్య దినములలో తన దేవునితో నిలిచియుండినట్లయితే నిజాయితి గల, నీతిగల, సహృద భావముగల వ్యక్తిగా అతడు సింహాసనాన్ని సమీపించేవాడే. బలముగల భావనతో, తన జీవితంలో దేవుని ప్రసన్నత యొక్క జ్ఞానము గలవాడుగా ఉండేవాడే. అతడు దేవునిచే అంగీకరింపబడిన రాజుగా ఉండేవాడే. అతని నీతిగల జీవితము ప్రజల మధ్య గౌరవం తెచ్చిపెట్టియుండేదే. అతడు వారిని సార్థకమైన మార్గంలో నడిపించగలిగియుండేవాడే.

దేవునితో నడచుటను గూర్చి మనం ఆలోచిస్తూ ఉండగా హనోకు జ్ఞాపకం వస్తాడు (ఆదికాండము 5:22). దేవుని యొక్క దైవికమైన అంచనా అతని జీవితాన్ని గూర్చి – "అతడు దేవునితో నడచెను" అని వేయబడింది. అతని జీవితానికి పైపైననే కనిపించేదేదీ లేదు, వేషదారణలేదు. అతడు అనుదినము దేవునితో నడిచాడు. అతడు "దేవునితో నడిచాడంటే" ఆయనతో సహవాసం గలవాడని, అతడు దేవుని దిశలో పయనించినవాడని, దేవునితో అడుగులు వేసికొంటు వెళ్లుతున్నాడని గుప్తమైయుంది. ఈలాటి జీవిత విధానం భవిష్యత్తుకు అవసరమైన సిద్ధపాటు అయి ఉంది. దేవుని సహవాసంలో నివసింప నేర్చుకోటంవల్ల, వెళ్లవలెనని దేవుడు సూచించిన దిశలో వెళ్లుటకు నేర్చుకొనుటవలన, ఎంత వేగముగా సంగతులు జరగాలని దేవుడు కోరుకొంటున్నాడో అలా చేయ నేర్చుకొనటంవలన మనము రేపటికొరకు సిద్ధపడువారమైయుంటాం.

రాజు కాకమునుపు ఏలా యీలాటి సిద్ధపాటు కలిగియున్నాడు అనుకొందాం. అతడు ఏలాటి రాజైయుండేవాడు? దావీదుతో ప్రజలు ఏలాగు పోల్చబడ్డారో ఆలాగు మనము అతన్ని పోల్చియుండేవారమే. "దేవుని హృదయానుసారుడై, దేవునితో నడిచినవాడగు ఏలావలె నీవు ఉండాలని కోరుకుంటావ్" అని మనం అంటాం. దేవునితో జీవిత ఆరంభం నుండి అతడు నడవ నేర్చుకొన్నట్టయితే అతడు ఏలాటి రాజైయుండేవాడో ఆలోచించు!

## దేవునియందు నమ్మికయుంచుటవలన

ఏలా సింహాసనానికి సిద్ధపడియుండవలసిన మరొక మార్గము అతని బాల్య సంవత్సరాలలో దేవునియందు నమ్మికయుంచుట. దేవుడు తన వాగ్దానాలను

నెరవేర్చగలడని నమ్మికయుంచి అతడు దేవునికి లోబడ నేర్చుకోవలసిన అవసరముంది. దేశము దేవుని దేశమైయుంటానికిగాను దేవునియందు నమ్మికయుంచి లోబడవలసినదై ఉంది. దేవునికి లోబడియుండుట ఒక వంతు, మన అవసరతలు తీర్చి మనలను దీవించునని దేవునియందు పూర్ణమైన నమ్మికయుంచుట మరియొక వంతు. ఈ రెండింటిని ఏకముగా చేర్చి, వాగ్దానము చేసినది నెరవేర్చగల దేవునియందు నమ్మికయుంచి దేవునికి లోబడువానిలో దైవభక్తి గల జీవితాన్ని నీవు చూడవచ్చు.

రాజు తన దేశానికి స్థిరత్వమునిచ్చె శక్తియై ఉండాలి. కాలములు కఠినముగా ఉన్నప్పుడు యుద్ధ సంబంధమైన మేఘాలు పోగౌతున్నప్పుడు, "దేవుడు మనతో ఉన్నాడు మనము ఆయనకు లోబడియున్నాం ఆయన మన యుద్ధాలలో పోరాడుతాడు శత్రు చేతిలోనుండి మనలను తప్పిస్తాడు దిగులుపడకండి దేవునిపై మీ దృష్టి నిలపండి" అని చెప్పే నాయకుడు దేశానికి అవసరమైయుంటాడు. ఏలా ఈ పరిమాణముగల రాజై ఉండటానికి దేవుని సింహాసనము యొద్దకు వచ్చి అనేక సందర్భాలలోను, శోధన కాలాలలోను దేవునియందు నమ్మికయుంచిన చరిత్ర అతనికి అవసరమైయుంది. అతనికి అనుభవం కావాలి – యుద్ధ రంగంలో తర్ఫీదు కాదు, కాని విశ్వాస మూలముగా జీవించుట.

ఏలా దేవునియందు నమ్మికయుంచుటకు ఎన్నడు నేర్చుకొనలేదు. ధనమునందును, స్థితియందును, వారసత్వమందును, సైనిక బలమునందును నమ్మికయుంచ అతడు నేర్చుకొనియుండవచ్చు. ఈ విధంగా అతడు సింహాసనమునకు వచ్చినప్పుడు అతడు తనమీదనే ఆనుకున్నాడు. ఎవరు సహాయంకొరకు తనవైపు చూస్తారో దేవుడు వారికి సహాయం చేస్తాడు. తన యెడల యథార్థ హృదయము గలవారిని బలపర్చుటకు యెహోవా కనుదృష్టి లోకమందంతటను సంచారము చేయుచున్నది (2 దినవృత్తాంతములు 16:9). దేవుని కొరకైన అవసరతను ఏలా చూచినట్లు లేదు. దేవుడు లేకుండ జీవించే తన కోర్కె యొక్క ప్రతిఫలాన్ని ఏలా ఎదుర్కొనేలా దేవుడు అతని విడిచిపెట్టాడు.

## ముగింపు

ఏలా ఇశ్రాయేలు యొక్క మహా ఘనమైన రాజుల్లో ఒకడైయుండే అవకాశం ఉండింది, అయితే అతడు సిద్ధపాటు లేనివాడైయున్నాడు. అతడు తన వారసత్వాన్ని పొందినప్పుడు, అతడు దానికి తగినవాడై ఉండలేదు. రాజదండము అతని చేతికి యివ్వబడింది, దానితో ఏమి చేయాలో అతనికి తోచకయుండింది. అతని సిద్ధపాటు లేమి అతని పరిపాలనలోను, అతని జీవితంలోను, అతని మరణంలోను సహా కనిపిస్తుంది.

అతడు "రాజైయుండేవాడే" అని మాత్రమే ఏలా గుర్తు చేసుకోబడతాడు అతడు ఎన్నడును విశేషియైయుండడు. అతడు దేశాన్ని దేవుని వైపుకు త్రిప్పి అతడు దేవుని యొక్క కథానాయకుడుగా ఉండవలసినవాడే. దానికి బదులు ఒక త్రాగుబోతుగా అతడు విఫలుడై మరణించాడు. అతని సమాధి మీద ఈ క్రిందివాటికంటె మిన్నైన మాటలు ఏవియు వ్రాయబడి ఉండేవి కావు:

ఇశ్రాయేలు యొక్క నాలుగవ రాజైన
ఏలా
ఇక్కడ పడియున్నాడు
888నుండి 886వరకు పాలించాడు

అతనికి గొప్పతనము అప్పగింపబడినప్పుడు
దాని పొందటానికి అతడు సిద్ధపడియుండలేదు.

అయితే మన విషయం ఎలాగుంది? సిద్ధపాటు యొక్క ఆవశ్యకతను మనం అలక్ష్యం చేస్తామా? మన ప్రతి ఒక్కరి జీవితంలో శ్రేష్ఠమైన క్షణాలు వస్తూ ఉంటాయి, వాటికి సిద్ధపాటు అవసరమైయుంటుంది. ఇతరులు క్రీస్తునొద్దకు, మరణమునొద్దకు, క్రీస్తు రాకడ యొద్దకు, తీర్పు దినమునొద్దకు నడిపించె అవకాశం మనం ఎదుర్కొంటాం. "నీ దేవుని ఎదుర్కొనుటకు సిద్ధపడుమని" ఆమోసు గర్జన చేసాడు (ఆమోసు 4:12బి). మనము ఆయనను ఎదుర్కొనడానికి సిద్ధమేనా? మన సమాధి రాళ్లమీద ఏమని వ్రాయబడతామో? మనము "సిద్ధపడతామా" లేక "సిద్ధపాటు లేకుండ" ఉంటామా?

పెండ్లి కుమారుని ఎదుర్కొనుటకు సిద్ధపడిన పదిమంది కన్యకల కథలో ప్రభువు చెప్పింది జ్ఞాపకముంచుకో (మత్తయి 25:1-13). ఐదుగురు సిద్ధపడ్డారు, ఐదుగురు సిద్ధపడలేదు. ప్రవేశించే సమయం వచ్చినప్పుడు ఐదుగురు ప్రవేశించారు. ఐదుగురు ప్రవేశింపలేదు. ఈ వేదనకరమైన మాటలను ధ్యానించు బహుశా అవి బైబిలు అంతటిలో బహు విచారకరమైన మాటలైయున్నాయి: "... అంతట తలుపు వేయబడెను" (10 వ.). దీని గూర్చి ఆలోచన చేయి: "అంతట తలుపువేయబడింది." వారి అవకాశము వెళ్లిపోయింది, అది గతించిపోయాక తిరిగి రాదు. ఐదుగురు కన్యకలు ప్రవేశింపగలిగే వారు, కాని వారు సిద్ధపడలేదు, స్వాస్థ్యమునకు వారు పాత్రులు కారు. "మీరు రాలేదు ఎందుకంటె మీరు సిద్ధంగా లేరు" అని దేవుడు చెప్పాడు.

విపత్తులన్నిటిలో బహు భయంకరమైనది, కడపటి దినాన, "మీరు పరలోకానికి రాలేరు ఎందుకంటె మీరు సిద్ధంగా లేరు" అని ప్రభువు అంటే అది మహా విపత్తుకరమైనది. మనము యిక్కడే యిప్పుడే "సిద్ధపడడానికి" తీర్మానించుకొందాం.

**నేర్చుకోవలసిన పాఠం:**
**పరలోకమందు నీవు నీ స్వాస్థ్యము పొందునట్లు**
**విశ్వాసముతో దేవుని విధేయతతో**
**నడుచుకొనడానికి యిప్పుడే నేర్చుకో.**

సూచన

[1]W. Graham Scroggie, *The Unfolding Drama of Redemption* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1976), 301.